క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి: లక్కవరంలో రూ.2 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవనం ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ బోదెపు గోవింద్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారాయని, అన్ని సౌకర్యాలు సమకూరాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గవర్ల అనకాపల్లిలో మరిడిమాంబ పండగ


మరిడిమాంబ అమ్మవారు

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు తెలిపారు. ఏటా మార్చి రెండవ వారంలో ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

పాడి రైతులకు దుప్పట్ల పంపిణీ


రైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పాలసంఘ అధ్యక్షుడు శ్రీనివాసరావు

మునగపాక: విశాఖడెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నారాయుడుపాలెం పాలసంఘ అధ్యక్షుడు సబ్బి శ్రీనివాసరావు కోరారు. నారాయుడుపాలెం పాలకేంద్రంలో బుధవారం పాడిరైతులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం విశాఖడెయిరీ సేవలందిస్తుందన్నారు. డెయిరీ ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. డెయిరీ సూపర్‌వైజర్ ఆదిఅప్పారావు,వేతన కార్యదర్శి కోన శ్రీనివాసరావు,రైతులు పాల్గొన్నారు.

తోటాడ శ్మశానవాటిక అభివృద్ధికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, సర్పంచ్ మంగవేణి

మునగపాక: మండలంలోని తోటాడ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బుధవారం ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మిలు భూమిపూజ చేశారు. పంచాయతీ నుంచి శ్మశానవాటిక అభివృద్ధికి తొలివిడతగా రూ.6లక్షలు కేటాయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటాడలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి బాలాజీ, మళ్ల ఈశ్వరరావు, జగదీష్, పరమేష్,పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ,ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాము, వార్డుసభ్యులు బుద్ద రమేష్ పాల్గొన్నారు.

15న జాబ్ మేళా

తుమ్మపాల: పట్టణంలో సాయి కుల్వంత్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.కామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులైన, 25 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు.

పట్టణాభివృద్ధికి సమన్వయంతో కృషి

- యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి


మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో చర్చిస్తున్న చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి,సభ్యులు

యలమంచిలి రూరల్: పట్టణాభివృద్ధికి అధికారులు, పాలకవర్గం సమన్వయంతో కృషి చేయాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడానికి పాలకవర్గం, అధికారులు, ప్రజల సహకారం అవసరమన్నారు. ఆస్తి పన్ను బకాయిలను ఈ నెల 31లోగా చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకునేలా వార్డు కౌన్సిలర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని ఆమె కోరారు. అజెండాలో పొందుపరిచిన 11 అంశాలలో 10 అంశాలు, టేబుల్ అజెండాలో మూడు అంశాలకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. పురపాలకసంఘంలోని విలీన గ్రామాల్లో చెత్త సేకరణకు తోపుడు బళ్లు కొనుగోలు కోసం పొందుపరిచిన మొదటి అంశాన్ని తిరస్కరించారు. తాగునీటి సరఫరా నిమిత్తం గతంలో చేపట్టిన వివిధ పనులకు సంబంధించి రూ.37,03,908 చెల్లించేందుకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొమ్మాయిగుండం చెరువు సుందరీకరణ పనుల కోసం మున్సిపాలిటీ వాటా సొమ్ము రూ.5 లక్షలు చెల్లించడానికి, గతంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు బకాయిపడిన బిల్లుల సొమ్ము చెల్లించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలు ఇవి

రోజువారీ మార్కెట్, వారపు, పశువుల సంత ఆశీలు వసూలుకు ఈ నెల 5వ తేదీన జరిగిన బహిరంగవేలం పాటలో నిబంధనలు పాటించలేదని వార్డు కౌన్సిలర్ సుంకర మరిణేశ్వరరావు సమావేశం దృష్టికి తెచ్చారు.సరైన ప్రచారం చేయకుండానే వేలంపాట నిర్వహించడంతో పురపాలక సంఘం ఆదాయానికి గండి పడిందన్నారు.ధరావతు సొమ్ము చెల్లించని వారిని కూడా వేలంపాటకు అనుమతించారన్నారు. అలాగే గతంలో 2017-18.2018-19 సంవత్సరాల వేలంపాట దక్కించుకున్న కాంట్రాక్టర్లు పురపాలకసంఘానికి బకాయి పడిన సొమ్ము ఇప్పటివరకూ ఇంకా చెల్లించలేదని రికవరీకి చర్యలు తీసుకోవాలని కోరారు.

- పట్టణంలో ఓరుగంటివారి వీధి,రంగావారి వీధి, ఎంపీడీవో కార్యాలయం కూడలి,గాంధీనగరం ప్రధాన రహదారుల్లో కల్వర్టులు శిథిలమయ్యాయని, వాటి మరమ్మతుపనులను అత్యవసరంగా చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా అన్నారు
- మర్రిబంద జగనన్న కాలనీలో వీధిలైట్ల ఏర్పాటు పూర్తయి నెలలు గడుస్తున్నా వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు సమావేశంలో లేవనెత్తారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్‌శాఖ ఏఈని కోరారు.ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఏఈకి సూచించారు.
- ఎన్టీఆర్ కాలనీలో లోవోల్టేజీ సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు పరిస్థితిని చక్కదిద్దాలని రామారాయుడుపాలెం కౌన్సిలర్ సుంకర మరిణేశ్వరరావు కోరారు.

అచ్యుతాపురంలో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం


డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

అచ్యుతాపురం: మండల కేంద్రం అచ్యుతాపురంలో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు, అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమల బుధవారం ప్రారంభించారు. అనంతరం మండలానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, దేశంశెట్టి శంకర్‌రావు, కోన బుజ్జి,లాలం శ్రీను,శేషగిరి,జువ్వాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి


మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలులో మొల్లమాంబ జయింతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కుమ్మరిశాలివాహన సంఘం సభ్యులు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమ్మరిశాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దేవారపు అర్జున వెంకటరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మొల్లబాంబ జయింతిని అధికారికంగా నిర్వహించాలని కోరినప్పటికీ ఫలితం లేకపోయిందని, మొల్లబాంబ జయింతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని చెప్పారు. దీంతో తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా మార్చి 13న మొల్లమాంబ జయింతిని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుమ్మరిశాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ అప్పలకొండ, సభ్యులు నక్కా నాగేశ్వరరావు, పొన్నాడ గంగాధర్, సోమరాజు, బాబ్జి, యండపల్లి ఈశ్వరరావు,మానేపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతలు వైఎస్సార్, ఎన్టీఆర్

కె.పురుషోత్తపురంలో విగ్రహాల ఆవిష్కరణ


వైఎస్సార్,ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న బోదెపు గోవింద్, రాజాన శేషు, బొద్దపు యర్రయ్యదొర, రాజాన సునీత, పట్నాల రామారావు దంపతులు

యలమంచిలి: పేద,బడుగు,బలహీన వర్గాల వారి కోసం దివంగత సీఎం డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి, దివంగత మాజీ సీఎం నందమూరి తారకరామారావు పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని స్థానిక వైస్ ఎంపీపీ రాజాన శేషు అన్నారు. కె.పురుషోత్తపురంలో శ్రీ భూమి డెవలపర్స్ యజమాని పట్నాల రామారావు సొంత నిధులు రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలను ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, గ్రామ సర్పంచ్ రాజాన సునీతతో కలిసి రాజాన శేషు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కొత్తలి గ్రామానికి చెందిన పట్నాల రామారావు గతంలో కూడా శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పురుషోత్తపురంలో మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యలమంచిలి రూరల్ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్,ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము, రేగుపాలెం గ్రామ సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, పద్మనాభరాజుపేట,బయ్యవరం గ్రామాల సర్పంచ్‌లు మొగలపల్లి సత్యనారాయణ,గొన్నాబత్తుల శివలక్ష్మి,శివ,ఎంపీటీసీ ఊటకూటి శేఖర్,వైఎస్సార్‌సీపీ నాయకులు గంధం శివ, మోహన్,పురుషోత్తపురం,కొత్తలి గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు బ్రహ్మాజీ,శ్రీనివాసరావు

మునగపాక: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ నేతలు ఎస్.బ్రహ్మాజీ, వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపడతామన్నారు. దీనిలో భాగంగా మునగపాక,వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట,పల్లపు ఆనందపురం తదితర గ్రామాల్లో బుధవారం రైతులతో సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. రైతులను రుణ విముక్తులను చేస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టనున్న ఆందోళనకు రైతులు మద్దతు తెలపాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

కోటవురట్ల: మండలంలోని నరసింగబిల్లి హైస్కూలు 2007-08 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. అనాథ బాలుని దత్తత తీసుకొని చదివించడానికి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. జెట్టపురెడ్డితునికి చెందిన అల్లవరపు భారతి గతంలో మృతి చెందడంతో ఆమె కుమారుడు ప్రసాద్ అనాథ అయ్యాడు. దీంతో ప్రసాద్‌కు విద్యా బుద్ధులు నేర్పించి ప్రయోజకుడిని చేయాలని వారు నిర్ణయించుకున్నారు.నరసింగబిల్లి హైస్కూలులో చదివిన 2009-08 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా కలిసి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాలుని చదువు పూర్తిచేయడానికి భవిష్యత్తులో ఇలాగే తమకు తోచిన సహాయాన్ని సమకూర్చాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు.

భవిత కేంద్రం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న సునీత్ తదితరులు

రాంబిల్లి: భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు సెజ్‌లో ఒక కంపెనీలో పనిచేస్తున్న సునీత్ పెన్నులు, పుస్తకాలతో పాటు కేంద్రానికి అవసరమైన ఫర్నీచర్, ఇతర సామగ్రిని అందజేశారు. బుధవారం విద్యార్థులకు పలు రకాల వంటకాలతో భోజనం పెట్టారు. దివ్యాంగ విద్యార్థులు నిరుత్సాహ పడకుండా చదువుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేణుగోపాల్, ధనుంజయ్, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు బుజ్జిబాబు, నాగరత్నం పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్


పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు ఇస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ మల్లే లోవరాజు విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సమకూర్చారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు టెన్త్ విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బోడిపల్లి అప్పన్న, ఉపాధ్యాయులు స్వర్ణగౌరి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన


గ్లకోమాపై రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పాయకరావుపేట: కంటి రోగులకు గ్లకోమా పై హైమా నేత్రాలయంలో అవగాహన కల్పించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గ్లకోమా (నీటి కాసులు) వల్ల వచ్చే సమస్యలు ముందుగా ఎలా గుర్తించాలో తెలియజేశారు. హైమా నేత్రాలయ వైద్యులు డాక్టర్ శివరాజుప్రసాద్ ఆధ్వర్యంలో గ్లకోమా ప్రత్యేక వైద్యులు మధురై అరవింద్, నేత్ర వైద్యాలయం డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి అవగాహన కల్పించారు.

'అపూర్వ' కలయిక


గణపర్తిలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

మునగపాక: మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఇదే స్కూల్‌లో 1976-77లో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరి నాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. నాడు విద్య నేర్పిన గురువులు ఎల్లేటి అప్పారావు, నీలవేణి, సత్యనారాయణ రాజులను ఘనంగా సత్కరించారు. కర్రి అప్పలనాయుడు, దొడ్డి సూరప్పారావు, గిన్నె సూర్యనారాయణ, జనార్దన్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు


యువతికి వైద్య పరీక్షలు చేస్తున్న గైనకాలజిస్ట్

యలమంచిలి రూరల్: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండోవిడత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటలకు కాలనీలో ఉన్న సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉన్నత లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ వైద్య శిబిరంలో పట్టణంలోని రాంనగర్, ఏఎస్ ఆర్ కాలనీ, ఎర్రవరం శేషుకొండ కాలనీ, యానాద్రి కాలనీలకు చెందిన 305 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.స్పెషలిస్టు వైద్యులు పలువురికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందుల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్.ఝాన్సీరాణి, బి.వి.ఎస్. జైదీప్, ఈ లీల, పిల్లా త్రినాథరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

167 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము


రేగుపాలెంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి: మండలంలోని ఏటికొప్పాకలో 167 మందికి వైఎస్సార్‌సీపీ నాయకుడు సేనాపతి రాము బుధవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నగిరెడ్డి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కరణం రవి, దిమిలి రమణబాబు, పంచదార్ల బాబ్జి,నగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

యలమంచిలి : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదల సొంతింటి కల సాకారమైందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. రేగుపాలెం గ్రామంలో బుధవారం జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విశాలాక్షి కాశీ విశ్వేశ్వర స్వామిల కల్యాణం


విశాలాక్షి,కాశీ విశ్వేశ్వర స్వామిల కల్యాణంలో పాల్గొన్న దంపతులు


అన్న సమారాధనకు హాజరైన భక్తులు

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో బుధవారం విశాలాక్షి, కాశీ విశ్వేశ్వర స్వామిల కల్యాణం ఘనంగా జరిగింది. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. వేదపండితులు పరిటి సోమశేఖరశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబు నాయుడు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని, అందుకోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని విశాఖ ఉమ్మడి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. మండలంలోని పెంటకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 49 మంది 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ పేదలందరికీ విద్యను అందించాలన్న ధ్యేయంతో నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యాకానుక, విదేశీ చదువులకు నిధులు మంజూరు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, ప్రధానోపాధ్యాయుడు సూర్యానారాయణ, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం


పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ కనకారావు


కాలువ నిర్మాణం కోసం రోడ్డు అంచును కట్ చేస్తున్న కూలీలు

రాంబిల్లి: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పెదకలవలపల్లి సర్పంచ్ యలమంచిలి కనకారావు అన్నారు. గ్రామంలో బుధవారం ఆయన మురుగుకాలువలు నిర్మాణం, శ్మశానవాటికలో వాటర్ ట్యాంకు నిర్మాణం, రేకుల షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.6.5 లక్షలతో ఈ పనులు చేపట్టినట్టు తెలిపారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వస్తామని చెప్పారు. తమ గ్రామంలో కోట్లాది రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేసినట్టు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుణ్యమంతుల తాతబాబు, ఉప సర్పంచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.